సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం ౹ 24 ౹ జూలై ౹ 2024

న్యూస్‌రీల్

ప్రత్యామ్నాయ రహదారులు నిర్మించాలి

- కలెక్టర్‌కు జెడ్పీటీసీ సుస్మిత వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చి సమస్యలు వివరిస్తున్న జెడ్పీటీసీ సుస్మిత

ఎటపాక: గోదావరి వరదల సమయంలో గ్రామం చుట్టూ వరదనీరు చేరిన సమయాల్లో సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రహదారులను నిర్మించాలని కోరుతూ జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఎటపాక వచ్చిన ఆయను కలిసి ముంపు సమస్యలను వివరించారు. చలంపాలెం నుంచి కాటుకపల్లి జాతీయ రహదారి వరకు గతంలో ఉన్న రహదారిని పునర్నిర్మించాలని కోరారు. ఈరహదారి వరదల సమయంలో భద్రాచలం వెళ్లేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. కృష్ణవరం వద్ద కల్వర్టు నిర్మాణం, మారాయిగూడెం నుంచి బొజ్జిగుప్ప వరకు రహదారి మరమ్మతులు చేపట్టాలని ఆమె కోరారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

సాక్షి,పాడేరు: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో ఈనెల 24న జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలన్ని తెరవకుండా మూసివేయాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బయటకు పంపవద్దని ఆయన సూచించారు.

ప్రమాదస్థాయికి సూరంపాలెం జలాశయం

గంగవరం : భారీగా వరదనీరు చేరుతుండటంతో మండలంలోని సూరంపాలెం జలాశయం ప్రమాదస్థాయికి చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం 105 మీటర్లకు చేరుకోవడంతో ఇకపై ప్రాజెక్టులోకి వచ్చే నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో మంగళవారం గోకవరం తహసీల్దార్ హేమకుమారి జలాశయాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. వీఆర్వో రాజామణి, గోకవరం, గంగవరం మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. వరద పరిస్థితుల నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ సత్యసులోచన సిబ్బందిని అప్రమత్తం చేశారు. వాగుల వద్ద వంతెనల వద్ద గస్తీ ఏర్పాటుచేశారు.

నేడు అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు



ప్రిన్సిపాల్ విజయభారతి

చింతపల్లి రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. కళాశాలలో 2024–25 సంవత్సరానికి గాను అతిథి ప్రాతిపదికన జువాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టుల్లో ఒకొక్క పోస్టు ఖాళీగా ఉందన్నారు. వీటికి అర్హత ఉన్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోస్టులకుగాను ఆయా సబ్జెక్టుల్లో మాస్టర్ ఆఫ్ డిగ్రీలో 55 శాతం మార్కుల ఉత్తీర్ణతతోపాటు సెట్, నెట్,పీహెచ్‌డీ అభ్యర్థులు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత ఉన్నవారు ఒరిజినల్ ధ్రువపత్రాలతో చింతపల్లి డిగ్రీ కళాశాలకు హాజరుకావాలని, ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పోక్సో కేసు విచారణ



అడ్డతీగలలో పోక్సో కేసుపై విచారణ నిర్వహిస్తున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

అడ్డతీగల: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఈనెల 16న నమోదైన పోక్సో కేసుకు సంబంధించి చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విచారణ నిర్వహించారు. ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్న గిరిజన విద్యార్థినిని ఆ కళాశాల కామర్స్ అధ్యాపకుడు రామకృష్ణ లైంగికంగా వేధించాడని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసుతోపాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. దీనిపై ఏఎస్పీ రాహుల్ మీనా మంగళవారం ప్రత్యక్ష సాక్షులను విచారించారు. సీఐ ఆర్.రవికుమార్, ఎస్ఐ అప్పలరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- ముంపు వెతలు

కన్నీటి వరదలో ఊళ్లు



శబరి నది బ్రిడ్జి వద్ద కొట్టుకువచ్చిన చెత్త

గోదావరి, శబరి నదుల వరద ఉధృతి క్రమేపీ తగ్గుముఖం పడుతున్నా ఎగపోటు వల్ల వాగుల నీరు గ్రామాల్లోకి ఎగదన్నింది. మంగళవారం నాటికి కూడా రహదారుల వరద ముంపు కొనసాగింది. వీఆర్‌పురం మండలంలోని గ్రామాలకు వరదనీరు పోటెత్తడంతో ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. కలెక్టర్ దినేష్ కుమార్ వరద ముంపు గ్రామాల్లో సహాయ చర్యలను పర్యవేక్షించారు.



ఉభయ నదుల వరద ప్రభావంతో ముంపునకు గురైన వీఆర్‌పురం మండలంలోని శ్రీరామగిరి గ్రామం

- గోదావరి, శబరి నదులు శాంతిస్తున్నా వీడని ముంపు
- తగ్గుముఖం పట్టని ఎగపోటు
- సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లిన వరద బాధితులు
- ఆంధ్రా నుంచి ఒడిశా, తెలంగాణకు నిలిచిపోయిన రాకపోకలు

చింతూరు: భద్రాచలం వద్ద గోదావరి స్వల్పంగా తగ్గుముఖం పట్టినా ఎగపోటు కారణంగా చింతూరు మండలంలో శబరి నది నెమ్మదిగా పెరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రికి చింతూరు వంతెన వద్ద శబరినది నీటిమట్టం 41 అడుగులకు చేరుకుంది. గోదావరి తగ్గుముఖం పట్టడంతో శబరినది కూడా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వాగులకు ఎగపోటు

శబరినది పెరుగుతున్న నేపథ్యంలో చింతూరు మండలంలో వాగులు ఎగపోటుకు గురయ్యాయి. దీంతో వాటి నీరు రహదారులపైనే ఉండిపోయింది. జాతీయ రహదారి–326, జాతీయ రహదారి–30పై వరదనీరు ఉన్నందున ఆంధ్రా నుంచి ఒడిశా, తెలంగాణకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతోపాటు సోకిలేరు, చంద్రవంక వాగుల వరదనీటికి చింతూరు నుంచి కూనవరం, వీఆర్‌పురం మండలాలకు కూడా రాకపోకలు కొనసాగలేదు.

- జల్లివారిగూడెం, కుయిగూరు, చీకటివాగుల వరద ఉధృతికి చింతూరు మండలంలో 35 గ్రామాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. వరదనీరు రహదారులపై ఉన్నందున ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వందలాది వాహనాలు నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో నిలిచిపోయాయి.

650 కుటుంబాల తరలింపు

కూనవరం: గోదావరి, శబరి నదుల విలయతాండవానికి కూనవరంలోని ఉదయభాస్కర్ కాలనీ, గిన్నెల బజారు, బస్టాండ్ సెంటర్, శబరి కొత్తగూడెం ప్రాంతంలో వరద ముంపునకు గురయ్యాయి. శబరి కొత్తగూడెం, కొండ్రాజుపేట, పోచవరం కాలనీ తదితర ప్రాంతాల్లో వరదముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. మండల వ్యాప్తంగా 650 కుటుంబాలకు చెందిన 1,863 మంది బాధితులను 27 పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు.

వీడని ముంపు భయం

ఎటపాక: గోదావరి వరద ముంపు భయం ఇంకా వీడలేదు. మంగళవారం ఉదయం భద్రాచలం వద్ద 51.6 అడుగులకు చేరిన వరద మధ్యాహ్నం వరకు నిలకడగా ఉంది. అప్పటినుంచి వరద స్వల్పంగా తగ్గుతూ రాత్రి పది గంటలకు 49.5 అడుగులకు చేరింది. అయితే రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతూనే ఉంది. ఎగువన ఉన్న తాలిపేరు ప్రాజెక్టుకు వరద తాకిడి తగ్గడంతో వచ్చిన వరదను వచ్చినట్టే గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

- భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ఎటపాక మండలంలోని రాయనపేట,నెల్లిపాక,తోటపల్లి,నందిగామ వాగులకు వరద పోటు తగ్గలేదు. దీంతో రహదారులపై వరద కారణంగా రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.
- నందిగామ చుట్టూ వరద నీరు ఉండటంతో ప్రజలు,అధికారులు గన్నేరుకొయ్యపాడు నుంచి సుమారు మూడు కిలోమీటర్లు పడవలపై ప్రయాణించి వెళ్తున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

వీఆర్‌పురం: వరద ప్రభావిత గ్రామాల ప్రజలంతా ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. ఇప్పూరు,పోచవరం, జీడిగుప్ప, శ్రీరామగిరి తదితర వరద ప్రభావిత గ్రామాల బాధితులు మండల కేంద్రానికి వచ్చే అవకాశం లేకపోవడంతో సమీప గుట్టలపై గుడారాలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు.

ముంపు ప్రాంతాల్లో సత్వర సహాయక చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్



చింతూరులో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు: వరద సహాయక చర్యలపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మంగళవారం రాత్రి ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవోలు అభిషేక్, చైతన్య, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళావందనంతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమాచారం అడిగి తెలుసుకున్నారు. డీఈవో బ్రహ్మాజీ రావు, డీపీవో కొండలరావు పాల్గొన్నారు.

ఎటపాక: ముంపు ప్రాంతాల్లో సత్వర సహాయక చర్యలు చేపట్టామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులతో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయంలో వరద సహాయక చర్యలపై జేసీ అభిషేక్‌గౌడ్, పాడేరు, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్,కావూరి చైతన్యతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మండలంలో కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేయటం జరిగిందని బాధితులను ఎక్కడికక్కడ ఆదుకునేందుకు ఏర్పాట్లు చేసామని బియ్యం, కందిపప్పు, కూరగాయలు, వంటనూనె, టార్పాలిన్లు అందిస్తున్నామన్నారు. ప్రతీ పునరావాస కేంద్రంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి గర్భిణులను ఆయా మండలాల్లోని ఆస్పత్రుల్లో చేర్పించామన్నారు. నెల్లిపాక, కూనవరం రహదారిపై వరదను పరిశీలించారు. సీతాపురంలో రహదారి,డ్రైనేజి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. ఆయన వెంట తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.



కూనవరం, టేకులబోరు మధ్య పడవలో రాకపోకలు సాగిస్తున్న వరద ప్రాంతాల ప్రజలు



రహదారి పక్కన టెంటులో తలదాచుకుంటున్న కూనవరం మండలం శబరి కొత్తగూడెంకు చెందిన ఓ కుటుంబం



వీఆర్‌పురం: వడ్డిగూడెం గ్రామంలో నీటమునిగిన ఇళ్లు



వరద ముంపులో కూనవరంలోని ఉదయ్‌భాస్కర్ కాలనీ



విశాఖ సిటీ : విశాఖపై ఈసారి కూడా నిర్మలమ్మ కరుణించలేదు. కూటమి ప్రభుత్వ హయాంలో కూడా ఉమ్మడి విశాఖ జిల్లాకు రిక్తహస్తమే చూపించారు. రైల్వే జోన్ ఊసేలేదు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై భరోసా ఇవ్వలేదు. ఎప్పటిలాగే విశాఖ–చెన్నై కారిడార్ జపం చేసినా.. నిధులు మాత్రం విదల్చలేదు. అలాగే నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్, స్టార్టప్ పార్క్‌ల ప్రస్తావనే లేదు. మొత్తంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో సమర్పించిన 2024–25 బడ్జెట్‌లో విశాఖకు ఎప్పటిలాగే నిరాశను మిగిల్చింది. ఎన్డీయే కూటమిలో ప్రధాన మిత్రపక్షంగా చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పటికీ దీర్ఘకాల విశాఖ ప్రజల ఆకాంక్షలు, ప్రాజెక్టులు, అభివృద్ధి అంశంలో కేంద్రాన్ని ఒప్పించడంతో ఘోరంగా విఫలయ్యారన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు జిల్లావాసులకు అరచేతిలో స్వర్గాన్ని చూపించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు విశాఖ మొండిచేయి చూపించింది.

రైల్వే జోన్ ఊసేలేదు..!



విశాఖ వాసుల దీర్ఘకాల డిమాండ్ ప్రత్యేక రైల్వే జోన్‌కు ఈ సారి కూడా బడ్జెట్‌లో చోటు కల్పించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలో అంశమైనప్పటికీ.. ఇప్పటికీ రైల్వే జోన్‌ను పట్టాలెక్కించే విషయంపై ఎన్డీయే ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్థలం కేటాయించని కారణంగా జోన్ ఏర్పాటు అలస్యమవుతోందని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా నిస్సిగ్గుగా అబద్ధాలు వల్లేవేసింది. వాస్తవానికి 2014–2019 మధ్యే రైల్వే జోన్‌కు స్థలాన్ని కేటాయించాల్సి ఉండగా.. అప్పటి టీడీపీ ప్రభుత్వం కనీసం ఆ విషయాన్ని పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముడసర్లోవ ప్రాంతంలో సుమారు 53 ఎకరాలను సేకరించింది. ముందు కొంత స్థలంలో ఆక్రమణలు ఉండగా.. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించడంతో కొంత జాప్యం జరిగింది. జోన్‌కు అవసరమయ్యే 53 ఎకరాల్లో హద్దులు వేసి మరీ రైల్వే అధికారులకు అప్పగించింది. అయినా రైల్వే జోన్ కోసం నిర్మాణాలు చేపట్టకుండా స్థలం కేటాయించలేదని ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేశాయి. దీనిపై అప్పటి కలెక్టర్ స్థలాన్ని రైల్వే అధికారులకు అందించినట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైల్వే జోన్ పనులు ప్రారంభమవుతాయని ఎన్నికల ప్రచారాల్లో ఊదరగొట్టాయి. కానీ అధికారం చెపట్టిన తరువాత కేంద్రం ప్రత్యేక జోన్ విషయాన్ని విస్మరించింది. బడ్జెట్‌లో 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' ప్రస్తావనే చేయలేదు. దీనిపై వామపక్ష పార్టీలు, రైల్వే పరిరక్షణ సంఘం ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే జోన్‌కు స్థలాన్ని కేటాయించినా బడ్జెట్‌లో చోటు కల్పించకపోవడం పట్ల మండిపడుతున్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు విశాఖ రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు.

ఎప్పటిలాగే విశాఖ–చెన్నై కారిడార్ జపం

ఎప్పటిలాగే ఈ బడ్జెట్‌లో కూడా కేంద్రం విశాఖ–చెన్నై కారిడార్ జపం చేసింది. 2014 నుంచి ప్రతి బడ్జెట్‌లోను ఈ కారిడార్ ప్రస్తావన సర్వసాధారణమైపోయింది. ఈ కారిడార్ ద్వారా పరిశ్రమలు క్యూ కడతాయని ప్రతిసారి విశాఖవాసుల్లో ఆశలు రేకెత్తిస్తూ వస్తున్నారే తప్పా.. ఇప్పటి వరకు పైసా కూడా కేటాయించలేదు. ఈసారి కూడా విశాఖ–చెన్నై కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ.. ఎంత కేటాయింపులు చేస్తున్నామన్న విషయాన్ని మాత్రం ప్రకటించలేదు. దీంతో ఈ దఫా కూడా ఎప్పటిలాగే కారిడార్ ప్రకటనతోనే సరిపెడతారా? లేదా నిధులు కేటాయించి కారిడార్‌ను అభివృద్ధి చేస్తారా? అన్నది వేచి చూడాలి మరి.

కూటమి అట్టర్‌ఫ్లాప్



ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నేతల హామీలు కోటలు దాటాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే రైల్వే జోన్ పనులు ప్రారంభించేస్తామని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రాన్ని ఒప్పిస్తామని, విశాఖ–చెన్నై కారిడార్ అభివృద్ధితో అనేక పెట్టుబడులను తీసుకువస్తామని.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. అడ్డూ అదుపులేని హామీలతో చంద్రబాబు అండ్ కో విశాఖ ప్రజల నోట్లో బూర్లు వండేశారు. దీంతో అది నిజమని నమ్మిన జిల్లా ప్రజలు కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. కేంద్రాన్ని శాసించే స్థాయిలో అధికారాన్ని కట్టబెట్టినా.. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు మాత్రం ఎన్డీయేకు సాగిలా పడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో అంశాలపై గానీ, తెలుగువారి ఆత్మగౌరవంతో ముడిపడిన పరిశ్రమల పరిరక్షణ విషయంలో గానీ వీరు కనీసం కేంద్రం ఒత్తిడి తీసుకురావడంతో విఫలమయ్యారన్న విషయం ఈ బడ్జెట్‌లోనే స్పష్టమవుతోంది.

స్టీల్‌ప్లాంట్‌పై భరోసా ఏది?



విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. ఉక్కు పరిశ్రమ మూలధనాన్ని సమీకరించుకునే విషయంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా.. బడ్జెట్‌లో సంస్థ మనుగడకు ఒక్క పైసా కూడా విదిల్చలేదు. మూల ధన వ్యయాన్ని అధిగమించేందుకు సొంత గనులు కేటాయించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా కనీసం ఆలోచన చేయలేదు. ఒకవైపు క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం పలు మెట్రో నగరాల్లోని పరిశ్రమకు చెందిన నిరర్థక ఆస్తుల విక్రయాలకు ప్లాంట్ యాజమాన్యం సిద్ధమైంది. దీనిపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంట్‌ను అన్ని విధాల ఆదుకుంటామని కూటమి పార్టీలు హామీలు గుప్పించాయి. ప్రధానంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ప్లాంట్‌కు నిధులు సమకూర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని గొంతులు చించుకున్నారు. అధికారంలోకి వచ్చాక ఆ గొంతులు మూగబోయాయి. నష్టాల ఊబి నుంచి స్టీల్‌ప్లాంట్ బయట పడేందుకు నిధులు కేటాయించాలని ఒక్కసారి కూడా కేంద్రాన్ని అడిగిన పాపాన పోలేదు. మూలధన సమీకరణ, ఉత్పాదక వ్యయం పెరుగుదల వంటి కారణాలు చూపించి ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలన్న ఆలోచనలో భాగంగానే బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి, ఉపాధికి తోడ్పడని బడ్జెట్



కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ కలిగించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమిస్తూ ప్రకటన చేయలేదు. ఈ బడ్జెట్‌లో ప్రైవేటీకరణ మరింత తీవ్రమవుతుంది. విశాఖలో ప్రత్యేక రైల్వే జోన్ వంటి ప్రధాన విభజన హామీలను పూర్తిగా విస్మరించారు. అభివృద్ధికి, ఉపాధికి తోడ్పడని బడ్జెట్ ఇది.

– సీహెచ్.నరసింగరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ

రాష్ట్రానికి మొండి చేయి



బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఏపీకి మొండి చేయి చూపించింది. అమరావతికి రూ.15 వేలు కేటాయించినట్లు చెబుతున్నా అది నమ్మశక్యం కాదు. పోలవరం కోసం ఒక్క రూపాయి కేటాయించలేదు. విశాఖ కేంద్రంగా ఉన్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు నిధులు కేటాయించలేదు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గుతామని కానీ సెయిల్‌లో విలీనం చేస్తామని కానీ ప్రకటించకపోవడం దారుణం. దీనిపై కూటమి నేతలు గట్టిగా స్పందించాలి.

– జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

ప్రత్యేక హోదా ఏది..?



కేంద్రంలో చక్రం తిప్పేలా ఏపీ ప్రజలు చంద్రబాబుకు మెజారిటీ ఇచ్చినప్పటికీ.. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. ప్రత్యేక హోదా అంశంలో కేంద్రాన్ని ఒప్పించడంలో విఫలమయ్యారు. భారీగా నిధులు రాబట్టలేకపోయారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కనీసం స్పష్టమైన హామీ ప్రకటన కూడా చేయించుకోలేకపోయారు. ప్రత్యేక హోదా అనే పదాన్ని ప్రస్తావించకుండానే ప్రత్యేక సాయం ప్రకటన చేసింది కేంద్రం. కీలకమైన పోలవరం ప్రాజెక్టుకు అందించే సాయం మీదా సీతారామన్ స్పష్టమైన ప్రకటన చేయలేదు.

– వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ

క్లుప్తంగా

సీలేరులో చేపల వేటకెళ్లి ఒకరు గల్లంతు



బాబూరావు(ఫైల్)

సీలేరు: సీలేరు నదిలో చేపల వేటకు వెళ్లి ఒకరు గల్లంతయ్యారు. ఈ సంఘటన మంగళవారం సీలేరు పంచాయతీ కన్నబ్బాయి క్యాంపులో జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన కిల్లో బాబూరావు(40) ఉదయం సమీపంలో సీలేరు నదిలోకి చేపల వేటకు వెళ్లాడు. ఇక్కడ చేపలకు గేలం వేయడానికి వెళ్తున్న క్రమంలో కాలుజారి నదిలో పడిపోయాడు. దీంతో అతడి వెనుక ఉన్న లామా గోవింద్ గాలించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. వెంటనే కన్నబ్బాయి క్యాంపులోకి వెళ్లి అక్కడ యువకుల్ని తీసుకుని వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ జాడ దొరకలేదు. దీంతో సీలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చెట్టు కొమ్మ విరిగిపడి యువకుడికి తీవ్ర గాయాలు

పాడేరు : భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా చెట్టు కొమ్మ విరిగిపడడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని నీలకంఠనగర్‌కు చెందిన బడగల గుణ అనే యువకుడు మంగళవారం పాత ఆస్పత్రి సమీపంలో అటవీ శాఖ క్వార్టర్స్ వైపు వెళ్తుండగా చెట్టు కొమ్మ విరిగి అతనిపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆ యువకుడిని సమీపంలో ఉన్న జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు

చింతపల్లి రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, గంజాయి తదితరవాటికి దూరంగా ఉండి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరును తేవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి,వార్డెన్ వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.



వరద భయంతో ముందస్తుగా చింతూరు, కూనవరం రహదారిలో గుడారాలకు ఏర్పాట్లు



వరద ఇళ్లలోకి చేరడంతో ఇళ్లను ఖాళీచేసిన కూనవరం మండలం శబరికొత్తగూడెం వాసులు



వీఆర్‌పురం: శ్రీరామగిరిని వరదనీరు ముంచెత్తడంతో సమీపంలోని గుట్టపై గుడారంలో తలదాచుకున్న బాధితులు



గౌరిదేవిపేట,నల్లకుంట రహదారిపై చేరిన వరద

జలదిగ్బంధంలో వీఆర్‌పురం



ఎటపాక మండలంలో నీటమునిగిన పత్తి మొక్కలను చూపుతున్న బాధిత రైతు కామేశ్వరరావు



చింతూరు: వరదనీటిలో మార్కెట్ ప్రాంతం

వీఆర్‌పురం: మండలం భౌగోళికంగా ఒక పక్క అడవి, ఎత్తయిన కొండలు, మరోపక్క శబరి, గోదావరి నదులు ప్రవహిస్తుంటాయి. కాగా గోదావరి,శబరి నదులకు వరదనీరు పోటెత్తడంతో శబరి బ్రిడ్జికి సమీపం లోని ధర్మతాళ్లగూడెం వద్ద ప్రధాన రహదారిని వరద నీరు చుట్టుముట్టుంది. దీంతో కూనవరం -వీఆర్‌పురం మండలాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చింతూరు మండలం వేపు ప్రధాన రహదారిని ముంపులోనే ఉండటంతో వీఆర్‌పురం మండలం జలదిగ్బంధానికి గురైంది. వడ్డిగూడెం,శ్రీరామగిరి గ్రామాలను వరదనీరు చుట్టుముట్టడంతో గ్రామస్తులను పునరావాస కేంద్రాలను తరలించి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పూరు-కొట్టూరిగొమ్ము, శ్రీరామగిరి-సీతంపేట, సీతంపేట-తోటపల్లి, వడ్డిగూడెం-వడ్డిగూడెంకాలనీ, ధర్మతాళ్లగూడెం-వీఆర్‌పురం, అన్నవరం-ఉమ్మిడివరం, కన్నాయిగూడెం-చింతరేగుపల్లి , తుష్టివారిగూడెం-ఏపీగూడెం, రామవరం-సోములగూడెం గ్రామాల మధ్యలోని వరదనీరు రహదారులపైకి చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మర పడవలు ఏర్పాటుచేసి సహాయ కార్యక్రమాలు ముమ్మరం చేశామని తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్ తెలిపారు.

ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి

చింతూరు: వరదనీరు రహదారులపై నిలిచివున్న నేపథ్యంలో చింతూరు డివిజన్ ప్రజలు తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా సూచించారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ వరదల్లో ప్రయాణం చేయడం శ్రేయస్కరం కాదన్నారు. ప్రజలు ప్రమాద భరితంగా వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. చింతూరు వద్ద శబరి, ఎటపాక వద్ద గోదావరి నదుల వరదనీరు జాతీయ రహదారులపై నిలిచి ఉన్నందున రాకపోకలు నిషేధించామని, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశాకు వెళ్లేందుకు దారులు లేవనే విషయాన్ని ప్రజలు గమనించాలని ఏఎస్పీ తెలిపారు.

కూనవరం: స్థానిక పోలీసుస్టేషన్ చుట్టూ వరదనీరు చేరడంతో సిబ్బంది స్టేషన్‌ను ఖాళీచేసి భైరవపట్నంలో ఉన్న పోలవరం పునరావాస కాలనీకి తరలి వెళ్లారు. శబరికొత్తగూడెం, కొండ్రాజుపేట గ్రామాల ప్రజలు కొత్తూరు, చినార్కూరు సచివాలయంలో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో పునరావాసం పొందుతున్నారు. సినిమాహాలు సెంటర్లో భారీగా వరద నీరు చేరడంతో కూనవరం, టేకులబోరు మధ్య రాకపోకలు స్తంభించడంతో పడవలు ఏర్పాటుచేశారు. పంద్రాజుపల్లి, కోతులగుట్ట మధ్య కల్వర్టుపైకి వరదనీరు చేరడంతో రాకపోకలు స్తంభించడంతో ఇక్కడ కూడా పడవను అందుబాటులో ఉంచారు.

ఎటపాక: గొల్లగూడెం, గన్నవరం, జాలార్ల కాలనీ, నెల్లిపాక, వీరాయగూడెం, పొట్లకుంట, గన్నేరుకొయ్యపాడు, రాఘవాపురం గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యాయి. ఇక్కడి కుటుంబాలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించారు.

- నందిగామలో సుమారు 20 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగింది. నెల్లిపాక నుంచి భద్రాచలం వెళ్లే జాతీయరహదారి ముంపులోనే ఉంది. విలీన మండలాలతో ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నందున గోదావరికి మళ్లీ వరద తీవ్రత పెరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం

చింతూరు: రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు చింతూరు డివిజన్లోని వరద ముంపు ప్రాంతాల్లో సొసైటీ సేవలను విస్తృతం చేశారు. డివిజన్‌లోని చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లోని ముంపు బాధిత కుటుంబాలకు టార్పాలిన్లు, దోమతెరలు, హైజనిక్ కిట్లు పంపిణీ చేస్తున్నారు. జిల్లా కో ఆర్డినేటర్ లోహితాస్, కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

చింతూరు: కూనవరం మండలంలో ముమ్మరంగా వరద సహాయక చర్యలు చేపట్టడం జరిగిందని రంపచోడవరం పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. కూనవరం మండలంలోని పల్లూరు, గొమ్ముగూడెం గ్రామాల్లో పర్యటించిన ఆయన వరద సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ బాధితులకు బియ్యం , నిత్యావసరాలు, కూరగాయలు అందచేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

పునరావాస కేంద్రల్లో అన్ని సౌకర్యాలు

వీఆర్‌పురం: పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్టు రంపచోడవరం సబ్‌కలెక్టర్, వరద ప్రత్యేకాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని వరద ప్రభావిత గ్రామమైన శ్రీరామగిరిని మంగళవారం ఆయన బోట్‌పై వెళ్లి సందర్శించారు. వరద బాధితులతో మాట్లాడి, ప్రభుత్వం ద్వారా అందుతున్న సహకారంపై ఆరా తీశారు. అనంతరం రేఖపల్లిలోని పునరావస కేంద్రాలైన కేజీవీబీ, రైతు భరోసా కేంద్రం, మినీ గురుకులాలను పరిశీలించి, బాధితులకు బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద బాధితులకు సహాయక చర్యలు అందించేందుకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేశామని, బాధితులను గ్రామాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలించేందుకు పడవలు ఏర్పాటు చేశామని తెలిపారు. సహాయ సహకారాలు అందించేందుకు రెవెన్యూ, పోలీస్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్, ఎంపీడీవో ఆర్.ఫణేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మరపడవపై ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



ముంపు ప్రాంతానికి దోమతెరలు తరలిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది



సీతాపురంలో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్



ఎటపాక మండలంలో పడవలపై వెళ్తున్న నందిగామ వాసులు



వీఆర్‌పురం ప్రధాన రహదారిపై చేరిన వరదనీరు



కూనవరం మండలంలో క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలిస్తున్న పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఈదురు గాలులకు కూలిన చెట్లు

ఇళ్ల పైకప్పులు, పశువుల పాక ధ్వంసం



గిడుగుదేవుడు గ్రామంలో పశువుల శాలపై పడిన చెట్టు

పెదబయలు: ఈదురుగాలులకు మండలంలోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలాయి. సోమవారం రాత్రి భారీ వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో బొండాపల్లి పంచాయతీ బొండాపల్లిలో నాయుడు ఐతన్న,జర్సింగి కొండన్న ఇళ్లపై చెట్టు కూలి పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. ప్రమాదం నుంచి కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడ్డారు. గోమంగి పంచాయతీ గిడుగుదేవుడు గ్రామంలో రైతు పలాసి కృష్ణారావు ఇంటి సమీపంలో ఉన్న పశువుల పాకపై చెట్టు కూలింది. పాక లోపల ఉన్న 10 పశువులు,25 మేకలు సురక్షితంగా బయట పడినట్టు గ్రామ సర్పంచ్ బస్సుదొర మత్స్యరాజు, రైతులు తెలిపారు. ఇదే పంచాయతీ కుమ్మరివీధి గ్రామంలో లోచలి చిలకమ్మ అనేమహిళ ఇంటి గోడలు వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా గ్రామస్తులు కోరారు.

యూ.చీడిపాలెంలో...

కొయ్యూరు: మండలంలోని యూ.చీడిపాలెంలో మంగళవారం భారీ చింతచెట్టు నేలకూలింది. దీంతో మూడు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. కొన్ని రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెట్టు కూలినట్టు స్థానికులు తెలిపారు. పడిపోయిన చెట్టును తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. స్తంభాలు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బంగారుమెట్ట పాఠశాలలో ..

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఈదురుగాలులకు భారీ చెట్టు నేలకు ఒరిగింది.ఆ సమయంలో ఆ ప్రాంతంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.ఈ విషయం తెలుసుకున్న ఏటీడబ్ల్యువో స్వర్ణలత బంగారుమెట్ట ఆశ్రమ పాఠశాలను సందర్శించి,నేలకు ఒరిగిన చెట్టును పరిశీలించారు. హెచ్ఎం రాజేశ్వరితో మాట్లాడి చెట్టును తొలగించారు. తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను తెలిపారు.

దారకొండ-గుమ్మిరేవుల రహదారిపై ...

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం ధారకొండ-గుమ్మిరేవుల రహదారిలో వర్తండపాడు వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వర్తండపాడు రహదారి పక్కనే ఉన్న భారీ చెట్టు రహదారికి అడ్డంగా కూలిపోయింది. దీంతో ధారకొండ మీదుగా రాజమహేంద్రవరానికి వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి.



యూ చీడిపాలెంలో కూలిన చింతచెట్టు



గోమంగి పంచాయతీ కుమ్మరివీధిలో పాక్షికంగా కూలిన ఇంటి గోడ



బొండాపల్లిలో ఇంటిపై పడిన చెట్టు



వర్తంపాడు వద్ద రహదారికి అడ్డంగా పడిన చెట్టు

మన్యంలో జ్వరాల విజృంభణ



పాడేరు జిల్లా ఆస్పత్రిలో రోగుల రద్దీ

- భారీగా నమోదవుతున్న మలేరియా కేసులు
- పెరుగుతున్న రోజువారీ రోగుల సంఖ్య
- పాడేరులోని జిల్లా ఆస్పత్రి కిటకిట
- రోగులతో నిండిపోయిన పడకలు

సాక్షి,పాడేరు: జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వైరల్, టైఫాయిడ్‌తో పాటు మలేరియా జ్వరాల తాకిడి నెలకొంది. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో తాగునీటి వనరుల కలుషితం, క్షీణించిన పారిశుధ్యం తదితర కారణాలతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. పాడేరులోని సర్వజన ఆస్పత్రితో పాటు వైద్యవిధాన పరిషత్ ఏరియా ఆస్పత్రులు, సామాజిక హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న రోగుల్లో జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

- పాడేరు సర్వజన ఆస్పత్రికి గత వారం రోజుల నుంచి ఓపీ పెరిగింది. ఈనెల 16న 744మంది, 17న 471మంది, 18న 575మంది, 19న 571మంది, 20న 312మంది, 21న 94మంది, 22న 435 మంది వైద్యసేవలు పొందారు. వీరిలో అధికంగా జ్వరపీడితులే ఉన్నారు. ఇన్‌పేషెంట్లు 250 నుంచి 300లోపు ఉంటున్నారు. సోమవారం నాటికి 249మంది రోగులతో వార్డుల్లోని పడకలన్నీ నిండిపోయాయి.
- జిల్లాలోని అరకులోయ, రంపచోడవరం, చింతపల్లి, చింతూరు ఏరియా ఆస్పత్రులతో పాటు ముంచంగిపుట్టు, కూనవరం, అడ్డతీగల ప్రాంతాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లాలోని 6 2పీహెచ్‌సీలకు రోగుల తాకిడి నెలకొంది.



జిల్లా ఆస్పత్రిలోని జ్వరపీడితులతో నిండిపోయిన పడకలు

ఇక్కడ ఆస్పత్రులకు కూడా జ్వర పీడితులు అధికంగా తరలివస్తున్నప్పటికి ఆయా వివరాలు గోప్యంగానే ఉంచుతున్నారు.

పెరుగుతున్న మలేరియా కేసులు

జిల్లాలో మలేరియా కేసులు కూడా నమోదు అవుతున్నాయి. జనవరిలో 53, ఫిబ్రవరిలో 147, మార్చిలో 207, ఏప్రిల్‌లో 225, మేలో 281,జూన్ నెలలో 581,జూలై నెలకు సంభందించి ఇంతవరకు 239 మందికి మలేరియా బారిన పడ్డారు.

మెరుగైన సేవలందిస్తున్నాం



జిల్లా సర్వజన ఆస్పత్రిలో పూర్తిస్థాయి సౌకర్యాలు గతంలో అందుబాటులోకి వచ్చాయి. సౌకర్యాలతో పాటు నాణ్యమైన వైద్యసేవలు రోగులకు అందిస్తున్నాం. అందువల్ల రోజువారి రోగుల సంఖ్య ఎక్కువగా ఉంది. .ఇన్‌పెసెంట్ల సంఖ్య పెరిగింది. జ్వరపీడితులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ విశ్వామిత్ర, సూపరింటెండెంట్, జిల్లా సర్వజన ఆస్పత్రి, పాడేరు

గిరిజనుల మెరుగైన జీవనోపాధికి కృషి

జీసీసీ నూతన వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి



మహారాణిపేట(విశాఖ): గిరిజనులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) నూతన వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి అన్నారు. జీసీసీ పురోభివృద్ధికి క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జీసీసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె జీసీసీ తాజా పరిస్థితిపై సమీక్షించారు. విజిలెన్స్, ఫైనాన్స్, మార్కెటింగ్, రిటైల్ మార్కెటింగ్, కాఫీ, పరిపాలన, అకౌంట్స్, రవాణా విభాగాలు, హాట్ అరబికా కాఫీ షాపు, ట్రైఫెడ్ రిటైల్ అవుట్ లెట్ అమ్మకపు కేంద్రాలను పరిశీలించారు. లాసన్స్ బే కాలనీలో జీసీసీ ఖాళీ స్థలాన్ని పరిశీలించి.. కార్యాచరణ కోసం పలు సూచనలు చేశారు. అరకు వ్యాలీ కాఫీ, మార్కెటింగ్, ఇతర అంశాలపై సమీక్షించారు. కల్పనాకుమారి గతంలో విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్–2గా, అనకాపల్లి జిల్లా జేసీగా విధులు నిర్వర్తించారు.

సెల్లుం పెట్రోల్ బంక్ మూసివేత

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ సెల్లుం గ్రామ సమీపంలో గల బంక్‌లో కల్తీ చేసిన డీజిల్,పెట్రోల్ అమ్మకాలు జరుగుతున్నట్టు వచ్చిన కథనాలపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. బంక్‌లో పెట్రోల్, డీజిల్ కల్తీ చేస్తూ విక్రయిస్తున్నందున వాహనదారులు అవస్థలు పడుతున్నారని పత్రికల్లో వచ్చిన కథనాలపై మంగళవారం స్థానిక తహసీల్దార్ రఫిజాన్ స్పందించి, డీటీ అప్పలస్వామి, ఆర్ఐ రవికుమార్,పంచాయతీ కార్యదర్శి సింహాచలం,వీఆర్వో కనకరత్నంతో కలిసి తనిఖీ చేశారు. వాహనదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విజిలెన్స్ అధికారుల తనిఖీ పూర్తయ్యే వరకు ఎటువంటి అమ్మకాలు చేయవద్దని ఆదేశిస్తూ బంక్‌ను తాత్కాలికంగా మూసివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రఫిజాన్ మాట్లాడుతూ ఫిర్యాదులు రావడంతో బంక్‌ను తనిఖీ చేసినట్టు చెప్పారు. విజిలెన్స్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, వారు త్వరలో తనిఖీ చేస్తారని తెలిపారు. అంత వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు చెప్పారు.